# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 322 | వరంగల్ | శుక్రవారం, 02 అక్టోబర్ 2026 | పేజీలు : 02





# అధికారుల తీరుపై వరంగల్ ఎంపీ కావ్య ఆగ్రహం

- సమగ్ర సమాచారం లేకుండా ఎందుకు వచ్చారు?
- దిశా సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య




**పాలకుర్తి వాణి, హనుమకొండ :** అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర సమాచారంతో దిశా సమావేశానికి హాజరుకావాల్సిన అధికారులు పూర్తి వివరాలు లేకుండా రావడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశా కమిటీ సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వచ్చే సమావేశానికి తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కొన్ని శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేకుండా అధికారులు సమావేశానికి హాజరుకావడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారం లేకుండా దిశా సమావేశానికి ఎందుకు వచ్చారు?" అని అధికారులను ప్రశ్నించారు. ఇకపై సమావేశానికి వచ్చే ప్రతి అధికారి తన శాఖకు సంబంధించిన పథకాల అమలు, పురోగతి, ఖర్చులు, పెండింగ్ పనులు, సమస్యలు, తదుపరి చర్యలపై పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. దిశా సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారి హాజరుకాకుండా ఇతర అధికారులు రావడంపై కూడా ఎంపీ ఆరా తీశారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారి ఎందుకు హాజరుకాలేదో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

**పాలకుర్తి వాణి, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ మండలం అక్కపల్లి గూడెం నుండి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యార కొమురెల్లి ఆధ్వర్యంలో సుమారు 20మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హన్మకొండ కనకదుర్గ కాలనిలోని నివాసంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొమ్మగాళ్ల పెత్రు, యార్ల మహిపాల్, చిన్నోజు జీవన్, కూసరాజు, అనుముల అనిల్, అనుముల అశోక్, బొమ్మగాళ్ల అఖిల్, బొమ్మగాళ్ల సురేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల కోసం సామాజిక మాధ్యమాల్లో మరింత పటిష్టమైన రక్షణ చర్యలు

- స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న



2


# WANTED
# విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



# గ్రామాభివృద్ధికి గ్రామ మ్యాప్ దోహదం

- ఎంపీడీవో వేదవతి
- సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పఠముపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విబిజీ రామ్ జీ పథకం ద్వారా గ్రామ మ్యాప్ను రూపొందించినట్లు ఎంపీడీవో వేదవతి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేదవతి, సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్, మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి గ్రామ మ్యాప్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలోని కుంటలు, చెరువులు, వ్యవసాయ భూములు, ఇళ్లు తదితర వివరాలను మ్యాప్ ద్వారా రైతులకు వివరించారు. ఇప్పటికే ఊట కుంటలు ఏర్పాటు చేసుకున్న రైతుల అనుభవాలను తెలియజేస్తూ, కొత్తగా ఊట కుంటలు ఏర్పాటు చేసుకునే విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె పాక కిరణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రోడ్ల శ్రీనివాస్ రెడ్డి,వార్డ్ మెంబర్స్ కత్తుల నరేష్, వీరమనేని హనుమంతరావు, కామారపు సునీల్, సలేంద్ర రమా సోమాన్న, నెమరుగంలో శ్రీనివాస్ రావు, కమ్మగానిశ్రీకాంత్ గౌడ్, వెలమకంటి స్వప్న సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ ఎన్ కొమురయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్, గ్రామ రైతులు, ఉపాధి హామీ కూలీలు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంపై తల్లులకు అవగాహన

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పోషణ మాసం సందర్భంగా పాలకుర్తి మండలం తొర్రూరు గ్రామంలో సెక్టార్ లెవెల్ గా ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లేశ్వరి మాట్లాడుతూ పోషకాహారం అందించడం సమతుల్య ఆహారం మరియు పరిశుభ్రత ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదల లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడం లో పోషకాహార పాత్రను ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ తల్లులు పిల్లలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్డెమ్మ నవరాత్రుల వేడుకలు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్డెమ్మ నవరాత్రుల వేడుకలను భక్తిశ్రద్ధలతో పాలకుర్తి మండల కేంద్రంలో విస్నూర్ రోడ్ లో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ మహిళల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు సంప్రదాయబద్ధంగా మట్టి, పసుపుతో బొడ్డెమ్మను ప్రతిష్ఠించి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్డెమ్మ చుట్టూ మహిళలు, బాలికలు సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన పూర్వీకుల నుంచి వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరి పద్మ, వీరమనేని భూలక్ష్మి, నీలిమ, పన్నీరు ఉమా, ఏలెంద్ర, ప్రియాంక, ఝాన్సీ, విజయ, ధనలక్ష్మి, సంతోషి,లలిత, స్వాతి, స్వరూప తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## పిల్లల కోసం సామాజిక మాధ్యమాల్లో మరింత

# పటిష్టమైన రక్షణ చర్యలు

- సుప్రీంకోర్టు చర్యను స్కోప్ సంస్థ స్వాగతించింది
- మైనర్లను ఆన్లైన్ దోపిడీ నుంచి రక్షించేందుకు డిజిటల్ వేదికలపై మరింత బాధ్యత అవసరం
- స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న



**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), పిల్లల రక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు తీసుకున్న తాజా చర్యను స్వాగతించింది. సామాజిక మాధ్యమ వేదికలు, ఇతర డిజిటల్ మధ్యవర్తులు మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను తప్పనిసరిగా పాటించేలా చట్టబద్ధమైన రక్షణ చర్యలను ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యంగా, 18 సంవత్సరాల చట్టబద్ధ వయస్సు కంటే తక్కువ ఉన్న మైనర్లు ఇటువంటి డిజిటల్ వేదికలతో స్వతంత్రంగా ఒప్పందాలు చేసుకునే అంశాన్ని కూడా పరిశీలించాలని కోర్టు సూచించింది. తెలంగాణలోని జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల రక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్కోప్ సంస్థ, ఈ పరిణామం డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అత్యవసర అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని పేర్కొంది. పిల్లలు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో, ఆన్లైన్ లైంగిక దోపిడీ, గ్రూమింగ్, సైబర్ వేధింపులు, సెక్స్టార్షన్, బాలల అక్రమ రవాణా వంటి ప్రమాదాలపై ఆందోళనలు పెరుగుతున్నాయని స్కోప్ సంస్థ తెలిపింది. ఆన్లైన్లో ప్రారంభమయ్యే ప్రమాదాలు కేవలం డిజిటల్ ప్రపంచానికే పరిమితం కాకుండా, వాస్తవ జీవితంలో పిల్లలను మోసం, మానిప్యులేషన్, లైంగిక వేధింపులు, దోపిడీ వంటి పరిస్థితులకు గురిచేసే అవకాశం ఉందని స్కోప్ స్పష్టం చేసింది.

స్కోప్ సంస్థ అధ్యక్షులు డా. బండి సాయన్న మాట్లాడుతూ “నేటి పిల్లలు తమ జీవితంలో గణనీయమైన సమయాన్ని ఆన్లైన్లో గడుపుతున్నారు. అయితే, ఆన్లైన్ ప్రపంచంలో దాగి ఉన్న ప్రమాదాలను పూర్తిగా అర్థం చేసుకునే వయస్సు, అవగాహన వారికి ఎల్లప్పుడూ ఉండకపోవచ్చు. సామాజిక మాధ్యమాలను అధికంగా మరియు తగిన పర్యవేక్షణ లేకుండా వినియోగించడం వల్ల పిల్లలు గ్రూమింగ్, లైంగిక వేధింపులు, ఇతర రకాల దోపిడీలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాలు కేవలం తెరపైనే ఆగిపోవు. పిల్లలను లక్ష్యంగా చేసుకుని మోసం చేయడం, ప్రభావితం చేయడం, చివరకు లైంగిక దోపిడీ,అక్రమ రవాణాకు సంబంధించిన పరిస్థితుల్లోకి నెట్టే అవకాశం ఉందని అన్నారు. ప్రతి బాలుడు సురక్షితంగా, రక్షితంగా ఉండేలా డిజిటల్ వేదికలపై మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, జవాబుదారీతనం అత్యవసరం.” పేర్కొన్నారు. మైనర్లు డిజిటల్ వేదికలపై స్వతంత్రంగా ఖాతాలను సృష్టించి నిర్వహించడంపై, ముఖ్యంగా ఒప్పందాలు చేసుకునే చట్టబద్ధ సామర్థ్యానికి సంబంధించిన వయోపరిమితుల నేపథ్యంలో ఆందోళనలను వ్యక్తం చేస్తూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ (జె ఆర్ సి అలయన్స్) దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు పరిశీలించిందని తెలిపారు . ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా పరిశీలన చేపడతామని కోర్టుకు తెలియజేసిందని అన్నారు. ప్రతిపాదిత చట్టబద్ధమైన వ్యవస్థ అమల్లోకి వస్తే, డిజిటల్ వేదికల జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంతో పాటు, భారతీయ చట్టాల ప్రకారం పిల్లల హక్కులు, భద్రతకు తగిన రక్షణ కల్పించేందుకు ఇది ఒక ముఖ్యమైన అవకాశంగా మారవచ్చని స్కోప్ సంస్థ పేర్కొంది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) దేశవ్యాప్తంగా బాలల రక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల విస్తృత నెట్వర్క్. ఇది 782 జిల్లాల్లో సమాజాలు, ప్రభుత్వ శాఖలు, చట్ట అమలు సంస్థల సహకారంతో పనిచేస్తోంది. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక దోపిడీతో పాటు వేగంగా మారుతున్న డిజిటల్ వాతావరణం నుంచి ఉత్పన్నమవుతున్న కొత్త రకాల ప్రమాదాల నుంచి పిల్లలను రక్షించేందుకు జె ఆర్ సి, దాని భాగస్వామ్య సంస్థలు కృషి చేస్తున్నాయి.

పిల్లలలో డిజిటల్ అవగాహన పెంపొందించడం, ఆన్లైన్ దోపిడీని నివారించడం, ప్రతి బాలుడికి సురక్షితమైన వాతావరణాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వ అధికారులు, బాలల రక్షణ సంస్థలు, పౌర సమాజ సంస్థలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక సమాజాలతో కలిసి పనిచేయడానికి స్కోప్ తన నిబద్ధతను పునరుద్ఘాటించిందని అన్నారు.



**పిల్లల కోసం సామాజిక మాధ్యమాల్లో పటిష్టమైన రక్షణ చర్యలకు సుప్రీంకోర్టు సూచనను స్వాగతించిన జె ఆర్ సి ప్రాజెక్ట్ (స్కోప్) కోఆర్డినేటర్ జి.మనోజ్ కుమార్**

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341